క్లుప్తంగా

మంత్రి కొండా సురేఖను కలిసిన దరిపల్లి



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న చంద్రం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అటవీ పర్యావరణ శాఖ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను సోమవారం హైదరాబాద్‌లో టీపీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం మర్యాదపూర్వకంగా కలిసినట్లు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ తెలిపారు. ఈసందర్భంగా జిల్లా అభివృద్ధికి, కాంగ్రెస్ నాయకులకు అండగా ఉంటానని మంత్రి భరోసా ఇచ్చారని పేర్కొన్నారు.

నర్సరీల్లో మొక్కలు పెంచాలి



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాఘవేంద్రరెడ్డి

హుస్నాబాద్‌రూరల్: నర్సరీల్లో రకరకాల మొక్కలు పెంచాలని ఎంపీడీఓ రాఘవేంద్రరెడ్డి అన్నారు. సోమవారం పందిల్ల నర్సరీని పరిశీలించి అందులో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. మన ఊరికి కావాల్సిన మొక్కలను మన దగ్గరే పెంచుకోవాలని సూచించారు. వర్షాలు పడగానే మొక్కలు నాటేందుకు ఆయా గ్రామాల్లో స్థలాలను గుర్తించాలని సూచించారు. ఆయన వెంట ఏపీఓ పద్మ ఉన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీపీ మానస

హుస్నాబాద్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రజల ఆర్థిక చేయూత కోసం సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందని.. వీటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మానస అన్నారు. సోమవారం పందిల్లలో వికసిత భారత్ సంకల్పయాత్ర నిర్వహించగా ఎంపీపీ హాజరై మాట్లాడారు. విశ్వకర్మ పథకం కోసం కేంద్రం రూ. 13 వేల కోట్ల నిధులు మంజూరు చేసిందని.. వీటికి 18 కుల వృత్తుల వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వ నిధులతోనే గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. అర్హులు దరఖాస్తు చేసుకొని రుణాలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాఘవేంద్రరెడ్డి, మండల వైద్యులు డాక్టర్ నిఖిత, సర్పంచ్ తోడేటి రమేశ్, ఎంపీటీసీ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం



గజ్వేల్‌రూరల్: విశ్వజన కళామండలి కేంద్ర కమిటీ జాయింట్ సెక్రటరీగా మాచపురం బాల్‌నర్సయ్య నియామకమయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సోమవారం గజ్వేల్‌లో బాల్‌నర్సయ్య మాట్లాడుతూ.. సామాజిక, రాజకీయ, సాంస్కృతిక, భౌతిక అంశాలపై విశ్వజన కళామండలి పనిచేస్తుందని తెలిపారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో డ్రైవర్ యూనియన్ సభ్యులు

కొండపాక(గజ్వేల్): మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంతో ఉపాధి కోల్పోతున్నామని మండలంలోని దుద్దెడలో సోమవారం ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా యూనియన్ అధ్యక్షుడు ఆరెళ్ల నర్సింలు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు నెలకు రూ. 15 వేల భృతి చెల్లించి ఆదుకోవాలని కోరారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్ యూనియన్ సభ్యులు అంజి, లింగం తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ కార్యకర్తకు గుర్తింపు

దుబ్బాక: కష్టపడే ప్రతీ కార్యకర్తకు కాంగ్రెస్‌లో గుర్తింపు ఉంటుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ డాక్టర్ మల్లు రవి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో దుబ్బాక మున్సిపల్ యూత్ పార్టీ అధ్యక్షుడు బురాని శ్రీకాంత్ సోమవారం ఆయనను హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు

కొండపాక మండల సమావేశంలో ఎంపీపీ సుగుణ



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ దేవి రవీందర్

కొండపాక(గజ్వేల్): ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం చూపొద్దంటూ ఎంపీపీ సుగుణ, వైస్ ఎంపీపీ దేవి రవీందర్ అన్నారు. మండల కేంద్రమైన కొండపాకలోని ఐఓసీ సమావేశ మందిరంలో సోమవారం ఎంపీపీ సుగుణ అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. మేదినీపూర్‌లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి నెలల తరబడి తీగలు లాగకపోవడంతో విద్యుత్ సమస్యలు ఎదుర్కొంటున్నామని సర్పంచ్ దశరథం సమావేశం దృష్టికి తెచ్చారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు గ్రామాభివృద్ధి పనులు చేయగా చాలా వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, త్వరగా వచ్చేలా అధికారులు చొరవ చూపాలని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షురాలు చిట్టి మాధురీరెడ్డి సమావేశం దృష్టికి తెచ్చారు. గతంలో మాదిరిగా గోదావరి జలాలతో చెరువులు నింపుతూ యాసంగి పంటలు ఎండిపోకుండా అధికారులు చూడాలని పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీలు సమావేశం దృష్టికి తెచ్చారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రభుత్వం అధికారంలో ఉన్నా లేకున్నా ఓట్లు వేసి గెలిపించిన ప్రజల సమస్యల పరిష్కారం కోసం కలిసికట్టుగా పని చేద్దామని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు మహాదేవ్‌గౌడ్, సర్పంచ్‌లు గూడెపు లక్ష్మారెడ్డి, మల్లమారి రవీందర్, చిటుకుల లత, ఏమల్ల రజిత, కాసపురం సంజీవరెడ్డి, ఎంపీటీసీలు చింతల సాయిబాబ, పత్తి ఆంజనేయులు, ఆరుట్ల లక్ష్మి, మంచాల అనసూయ, భూములుగౌడ్, అజీమొద్దీన్, నందాల శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీఓ వీరరాజు, ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, ఏఓ ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పును తగ్గించాలని ఆందోళన



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

సిద్దిపేటఅర్బన్: మిట్టపల్లి మీదుగా నిర్మాణం జరుగుతున్న జాతీయ రహదారి ఫోర్ లైన్‌ను పాత మార్కింగ్ ప్రకారం 100 ఫీట్ల వెడల్పుతోనే నిర్మించాలని బాధితులు సోమవారం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో 100 ఫీట్ల వెడల్పుతో మార్కింగ్ చేసిన అధికారులు ఇప్పుడు దానిని 150 ఫీట్లతో నిర్మించడానికి మార్కింగ్ చేస్తున్నారని వాపోయారు. అప్పట్లో అధికారులు ఇచ్చిన మార్కింగ్ మేరకు సుమారు 30 ఇళ్ల నిర్మాణం చేపట్టామని, పెంచిన వెడల్పుతో ఇళ్లను కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రైల్వే లైన్ వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జిని 600 మీటర్ల పొడవుతో కాకుండా 300 మీటర్ల వరకే నిర్మించాలని డిమాండ్ చేశారు. గతంలో రైల్వేలైన్ నిర్మాణం కోసం భూములు కోల్పోతే వచ్చిన డబ్బులతో ప్లాట్లు కొనుగోలు చేసి అందులో ఇంటి నిర్మాణం చేసుకుంటే ఇప్పుడు మళ్లీ రోడ్డు కోసం ఇంటిని కోల్పోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం ఆర్‌అండ్‌బీ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

సంగారెడ్డి టౌన్: తమిళనాడులోని అరుణాచల గిరి ప్రదర్శనకు సంగారెడ్డి ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్టు సంగారెడ్డి డిపో మేనేజర్ ఉపేందర్ తెలిపారు. ఈనెల 24వ తేదీ సాయంత్రం 6 గంటలకు సంగారెడ్డి నుంచి అరుణాచలం వయా హైదరాబాద్ నుంచి బస్సు అరుణాచలం బయలుదేరుతుందన్నారు. ఏపీలోని కాణిపాకం విఘ్నేశ్వర, వేలూరులోని మహాలక్ష్మి అమ్మవారి దర్శనం, అనంతరం 25న రాత్రి అరుణాచలం చేరుకుంటుందన్నారు. తిరిగి 26న సాయంత్రం బయలుదేరి 27వ తేదీన జోగులాంబ శక్తిపీఠం దర్శనం చేసుకుని సాయంత్రం సంగారెడ్డి చేరుకుంటుందని తెలిపారు. ఒక్కొక్కరికి టూర్ ప్యాకేజీ రూ.4,100 ఉంటుందని, సంస్థ అధికార వెబ్‌సైట్ ద్వారా రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 9959226267, 7382831381 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

దర్గాలో ప్రార్థనలు

టేక్మాల్(మెదక్): కర్ణాటకలోని హజ్రత్ ఖ్వాజా బందా నవాజ్ షరీఫ్ (గుల్బర్గా దర్గా)లో తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహ సోమవారం ప్రత్యేక ప్రార్థనలు చేసినట్లు మెదక్ జిల్లా మైనార్టీ చైర్మన్, మండల కో ఆప్షన్ సభ్యులు మజహర్ తెలిపారు. ఇందులో టేక్మాల్ మండల ముస్లిం నాయకులు ఉన్నారు.

గిట్టుబాటు ధర ఏదీ?



నిరసన తెలుపుతున్న పట్టు రైతులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సికింద్రాబాద్‌లోని తిరుమలగిరి పట్టు గూళ్ల మార్కెట్ ఎదుట రైతులు నిరసనకు దిగినట్లు జిల్లా పట్టు రైతుల సంఘం అధ్యక్షుడు పెద్దోళ్ల ఐలయ్య తెలిపారు. సిద్దిపేట జిల్లా పట్టు రైతుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నాణ్యమైన పట్టు గూళ్లు తీసుకెళ్లినప్పటికీ తిరుమలగిరి, జనగాం మార్కెట్లలో సరైన ధర రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే విక్రయించినా సక్రమంగా డబ్బులు రావడం లేదని, నెలల తరబడి ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా పట్టు పరిశ్రమశాఖ కమిషనర్, ఉన్నతాధికారులు చొరవ తీసుకొని రైతులకు న్యాయం చేయాలని, ధర లభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కోశాధికారి రాజు, కార్యవర్గ సభ్యులు బొగ్గుల నరసింహులు, పిల్లి శ్రీనివాస్, తులసీరామ్, పిల్లి పెద్ద శ్రీనివాస్, రమేశ్, రవీందర్, బాల్‌రెడ్డి, ఆంజనేయులు, స్వామి తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.

గొర్రెల యూనిట్లు మంజూరు చేయాలి

బెజ్జంకి(సిద్దిపేట): గొర్రెల యూనిట్ల కోసం డీడీలు తీసిన గొల్ల, కురుమలకు వెంటనే గొర్రెలను మంజూరు చేయాలని బీజేపీ గొర్రెల పెంపకందారుల సెల్ మండల కన్వీనర్ తూముల రమేష్ డిమాండ్ చేశారు. బెజ్జంకిలో సోమవారం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, సత్యనారాయణ, రమేష్, గంప రవి, తదితరులు పాల్గొన్నారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కాంగ్రెస్ నాయకులు

మంత్రి పొన్నంకు శుభాకాంక్షలు

ములుగు(గజ్వేల్): రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మండల కాంగ్రెస్ నాయకులు సోమవారం సచివాలయంలో కలిశారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన మంత్రిని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్తతో పాటు నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో మండల నాయకులు గణేష్‌యాదవ్, రాజుయాదవ్, శేఖర్‌గౌడ్, బుజెందర్‌రెడ్డి, మల్లేష్, ప్రవీణ్‌రెడ్డి, మల్లేష్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

అన్నివర్గాల సంక్షేమానికి కృషి



ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న అంగన్‌వాడీలు

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకటౌన్: అన్నివర్గాల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని పలువురు ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు, కుల సంఘాల బాధ్యులు, అంగన్‌వాడీ టీచర్లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం పట్టణంలో అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప పడిపూజలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి, అయ్యప్పసేవా సమితి అధ్యక్షుడు చింత రాజు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు సోలిపేట సతీష్ రెడ్డి, వ్యాపారవేత్తలు నల్ల శ్రీనివాస్, చింత మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

భూ సేకరణ నిలిపివేయాలి

ప్రజాభవన్‌కు ఐదు గ్రామాల రైతుల పాదయాత్ర

నర్సాపూర్ రూరల్: కొండపోచమ్మ కాల్వ ఏర్పాటు కోసం చేపడుతున్న భూ సేకరణ పనులు వెంటనే నిలిపివేయాలని కోరుతూ మండలంలోని ఐదు గ్రామాల రైతులు సోమవారం ప్రజాభవన్‌కు పాదయాత్రగా బయలుదేరారు. మండలంలోని పెద్ద చింతకుంట, చిన్నచింతకుంట, గొల్లపల్లి, లింగాపూర్, బ్రాహ్మణపల్లి గ్రామాలకు చెందిన సుమారు 50 మంది రైతులు మండలంలోని పెద్దచింతకుంట జల హనుమాన్ ఆలయం నుంచి హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌కు సుమారు 60 కిలో మీటర్ల దూరం పాదయాత్రగా వెళ్తున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కొండపోచమ్మ సాగర్ నుంచి సంగారెడ్డి వరకు ఏర్పాటు చేయబోయే కాల్వ కోసం పెద్ద చింతకుంటలో 60, చిన్నచింతకుంటలో 50, గొల్లపల్లి, లింగాపూర్ గ్రామాల్లో కలిపి 58, బ్రాహ్మణపల్లిలో 44 ఎకరాల భూమి సేకరించేందుకు అధికారులు ముమ్మరంగా చర్యలు చేపట్టారని తెలిపారు. పై గ్రామాల్లో అర ఎకరం నుంచి రెండు ఎకరాల లోపు భూములున్న రైతులకు సంబంధించిన భూములు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే భూసేకరణ పనులు నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. తమకు జరిగే నష్టాన్ని ముఖ్యమంత్రికి విన్నవించేందుకు ప్రజాభవన్‌కు పాదయాత్రగా వెళ్తున్నామన్నారు. భూములు పోతే తమ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు.



ప్రజాభవన్‌కు పాదయాత్రగా వెళ్తున్న రైతులు

విద్యార్థుల సామూహిక పద్యార్చన



సామూహిక పద్యపఠనం చేస్తున్న విద్యార్థులు

వర్గల్(గజ్వేల్): ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) పిలుపు మేరకు సోమవారం మండలంలోని వేలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సామూహిక పద్యార్చన జరిపారు. తానా ఆధ్వర్యంలో వందే విశ్వమాతరం పేరిట నిర్వహిస్తున్న శాంతి సద్భావన యాత్రలో భాగంగా సమన్వయకర్త చొప్పదండి రాధ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా చిగురుమళ్ల శ్రీనివాస్ రచించిన అమ్మ, నాన్న, గురువు శతకంలోని పద్యాలను కంఠస్తం చేశారు. ఉపాధ్యాయుల సమక్షంలో సమావేశమై సామూహిక పద్యపఠనం చేశారు. హెచ్ఎం కృష్ణసౌజన్య మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో తల్లిదండ్రులు, పెద్దల పట్ల గౌరవ భావం పెంపొందింపజేస్తాయని పేర్కొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

హుస్నాబాద్/కొండపాక(గజ్వేల్)/ మిరుదొడ్డి(దుబ్బాక): పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో సోమవారం సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు భానుమూర్తి ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆకుల వెంకట్, గురుస్వాములు వెంకట రమణ, అయిత శ్రీధర్, శివకుమార్, కుతాటి విజయభాస్కర్, శ్రీనివాస్ రెడ్డి, తాడ శ్రీకాంత్, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు. అలాగే కొండపాక మండలంలోని మర్పడ్గలో గల విజయదుర్గ సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రం ఆవరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. క్షేత్రం నిర్వాహకులు చెప్పెల హరినాథ శర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, స్వస్తిహవచనంతో కల్యాణోత్సవాన్ని ప్రారంభించారు. అక్బర్‌పేట- భూంపల్లి మండల పరిధిలోని మోతె రామలింగేశ్వర స్వామి క్షేత్రంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో అర్చకులు రాజమనోహర శర్మ ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



మర్పడ్గ: స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



హుస్నాబాద్‌లో..



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

సంక్షిప్త వార్తలు

◆ **పాఠశాల నిర్మాణానికి చేయూత**



హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్ నూతన పాఠశాల నిర్మాణానికి ఎన్ఆర్ఐ ఎర్రం రఘునందన్‌రెడ్డి చేయూత అందించారు. సోమవారం పాఠశాల నిర్మాణానికి రూ. 1.50 లక్షల ఆర్థిక సహాయం అందించి ఉదారత చాటుకున్నాడు. ఈసందర్భంగా పాఠశాల నిర్మాణ కమిటీ సభ్యులు రఘునందన్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల నిర్మాణ కమిటీ అధ్యక్షుడు కొత్తపల్లి అశోక్, సభ్యులు తాటిపల్లి వెంకటేశం, చిట్టి గోపాల్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, లక్ష్మీపతి, నీరుమల్ల శ్రీనివాస్, కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

◆ **ఏకగ్రీవంగా ఎన్నిక**

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని బందారం రెడ్డి సంక్షేమ సంఘం ఎన్నికలు సోమవారం ఏకగ్రీవం అయ్యాయి. అధ్యక్షుడిగా పాలడుగు బాల్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా నిమ్మ దుర్గారెడ్డి, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారిగా సురేందర్‌రెడ్డి తదితరులు ఎన్నికయ్యారు.

◆ **వైద్య శిబిరం విజయవంతం**

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్ గ్రామంలో సోమవారం మమత ఆస్పత్రి బాచుపల్లి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్ భానుప్రకాష్ రావు ప్రారంభించారు. సుమారు 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మందులు పంపిణీ చేశారు.

◆ **ఆర్థిక సాయం**

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని గురువన్నపేటలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బాధిత కుటుంబీకులను బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొంగు రాజేందర్‌రెడ్డి పరామర్శించారు. ప్రతి కుటుంబానికి ఆర్థిక సాయంతో పాటు 50 కేజీల బియ్యం అందజేశారు.

◆ **వైభవంగా శోభాయాత్ర**

దౌల్తాబాద్(దుబ్బాక): అయోధ్య రామాలయం నుంచి అక్షింతల కలశం సోమవారం మండల కేంద్రమైన దౌల్తాబాద్ చేరుకుంది. హిందూ సంఘాల నాయకులు వేంకటేశ్వర, హనుమాన్ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో హిందూ సంఘాల నాయకులు నర్సింలు, కిషన్, నర్సింహారెడ్డి, సంజీవరెడ్డి, ప్రభాకర్, రమేష్, లాలు, పెంటయ్య పాల్గొన్నారు.

◆ **21న సృజన టెక్ ఫెస్ట్**

మెదక్ కలెక్టరేట్: జిల్లా స్థాయిలో జరగనున్న 'సృజన టెక్ ఫెస్ట్‌ను' సివిల్ ఇంజినీరింగ్ బ్రాంచ్ విద్యార్థులు వినియోగించుకోవాలని మెదక్ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సువర్ణలత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టెక్ ఫెస్ట్ డిప్లొమా విద్యార్థుల్లో మంచి సృజనాత్మకత, నూతన పరిశోధనలు, నూతన ఆవిష్కరణలు రూపొందించేందుకు ఉపయోగపడుతుందని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. 21 ఉదయం మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఈ టెక్ ఫెస్ట్‌ను ఏర్పాటు చేస్తున్నామని, సివిల్ ఇంజినీరింగ్ బ్రాంచ్ విద్యార్థులంతా వినియోగించుకోవాలని సువర్ణలత కోరారు.

◆ **రెండు రోజులు నీళ్ల బంద్**

నర్సాపూర్: మిషన్ భగీరథ నల్లాల నుంచి రెండు రోజుల పాటు నీటి సరఫరా ఉండదని డీఈఈ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సంగారెడ్డి జిల్లా హత్నూరలోని భగీరథ నీటి శుద్ధి కేంద్రం సమీపంలో మెయిన్ పంపింగ్ పైపులైనుకు లీకేజీ ఏర్పడింది. దీంతో దానికి 19, 20 తేదీల్లో మరమ్మతులు చేస్తామని చెప్పారు. జిల్లాలోని నర్సాపూర్, వెల్దుర్తి, శివ్వంపేట, కౌడిపల్లి, కొల్చారం మండలాలతో పాటు సంగారెడ్డి జిల్లాలోని జిన్నారం, గుమ్మడిదల్ల మండలాల్లోని సుమారు 450 గ్రామాలకు 19, 20 తేదీల్లో నీటి సరఫరా ఉండదని వివరించారు. ఈనెల 21 నుంచి నీటి సరఫరా యథావిధిగా ఉంటుందన్నారు.

◆ **మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలి**

శివ్వంపేట(నర్సాపూర్): మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలని జోన్ సాధన సమితి సభ్యుడు ప్రసన్నకుమార్ అన్నారు. సోమవారం మెదక్ జిల్లాను సిరిసిల్ల జోన్‌లో ఉంచడం వల్ల ఇక్కడి జిల్లా నిరుద్యోగులు, ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని వారు అన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ కల్లూరి హరికృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భారతి, ఆర్ఐ కిషన్, ఎంపీఓ తిరుపతిరెడ్డి, చంద్రశేఖర్, జీవన్‌కుమార్, స్వామి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
యం. నాగరాజు-9010957373
రమేష్ - 9951952990